క్లుప్తంగా

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



మహబూబాబాద్ అర్బన్/దంతాలపల్లి: వ్యవసాయ మెడికల్‌కు సంబంధించిన వాటిపై ఎలాంటి పన్నులు లేకుండా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శ్యామ్‌సుందర్ శర్మ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వద్దిరాజు రామచంద్రరావు ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు నరేష్, బాలునాయక్, శ్యామ్‌ప్రసాద్, రాజేందర్, రవి, సుధాకర్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

డీఈఓకు సన్మానం



మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో టీఎస్ యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు గురువారం డీఈఓ పి.దక్షిణామూర్తిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి సామ మల్లారెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఏ. మురళీకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకూబ్, జిల్లా కార్యదర్శి మంజుల, హరినాయక్ పాల్గొన్నారు.

నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

నెల్లికుదురు: నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని వివిధ గ్రామాలల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించుకోవాలని తహసీల్దార్ చంద నరేష్, ఎస్సై చిర్ర రమేష్ బాబు ఉత్సవ కమిటీలకు గురువారం సూచించారు.

రేషన్ దుకాణం తనిఖీ

డోర్నకల్: రేషన్ డీలర్లు నిబంధనలు పాటిస్తూ రేషన్ దుకాణల్లో విక్రయాలు కొనసాగించాలని తహసీల్దార్ ఇమ్మానియల్ ఆదేశించారు. డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని 7, 14వ రేషన్ దుకాణాలను గురువారం తహసీల్దార్ తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ యాసీన్‌పాషా పాల్గొన్నారు.

షోకాజ్ నోటీసులు

బయ్యారం: మండలంలోని కొత్తపేటకు చెందిన దివ్య ఫర్టిలైజర్‌షాపులో నిబంధనలకు విరుద్ధంగా యూరియా విక్రయాలు జరగడంతో డీలర్ శేఖర్‌కు మండల వ్యవసాయాధికారి రాంజీ గురువారం తనిఖీ చేసి, షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

గ్రామపంచాయతీల వారీగా యూరియా పంపిణీ

గూడూరు: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో శనివారం నుంచి గ్రామ పంచాయతీల వారీగా కలెక్టర్ ఆదేశానుసారంగా యూరియా పంపిణీ చేయనున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ చల్ల లింగారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

విజయవంతం చేయండి

నెహ్రూసెంటర్: అక్టోబర్ 8,9 తేదీలలో గ్రామ పంచాయతీ యూనియన్ రాష్ట్ర 5వ మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈసమావేశంలో పి.సుధాకర్, కె.ఉపేందర్,కె.శ్రీనివాస్, అప్పిరెడ్డి, సుధాకర్, లతీఫ్, ప్రసాద్ పాల్గొన్నారు.

రైతుకు అస్వస్థత

కొత్తగూడ: రైతులకు యూరియా కష్టాలు తీరడం లేదు. రైతులు పీఏసీఎస్ వద్ద క్యూలో నిల్చుంటున్నారు. మండలంలోని ఈశ్వరగూడెం గ్రామానికి చెందిన కుంజ పెద్దలక్ష్మినర్సుకు బీపీ పెరిగి స్పృహ కోల్పోయాడు. ఎస్సై రాజ్‌కుమార్ తన వాహనంలో పీహెచ్‌సీకి తరలించి చికిత్స చేయించారు.

రావి ఆకుపై 'సర్వేపల్లి'



కేసముద్రం: మాజీ రాష్ట్రపతి, విద్యావేత్త సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్కరించుకుని, మున్సిపాలిటీ పరిధి అమీనాపురం గ్రామానికి చెందిన లింగాల నిఖిల్ అనే సూక్ష్మకళాకారుడు రావి ఆకుపై సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రాన్ని గురువారం గీశాడు.

ఆదరణ తగ్గుతున్న 'బొడ్డెమ్మ'

- ఒకప్పుడు మహిళలు పోటీపడి ఆడేవాళ్లు
- ఆధునికత పెరిగిన కొద్ది కనుమరుగు

దంతాలపల్లి: తెలంగాణలో జరుపుకునే పండుగల్లో బొడ్డెమ్మ పండుగా ఒకటి. అలాంటి బొడ్డెమ్మ పండుగకు క్రమంగా ఆదరణ తగ్గుతోంది. కొన్ని సంవత్సరాల క్రితం వరకు గ్రామీణ ప్రాంతాలలో ప్రతీ వీధుల్లోను పోటీపడి చేసుకునే ఈ పండుగా ఆధునికత పెరిగిన కొద్ది కనుమరుగవుతోంది. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలతో జరుపుకునే బొడ్డెమ్మ పండుగ మంచురోజులుగా చెప్పుకునే భాద్రపద మాసంలో వినాయకచవితి, బతకమ్మ పండగ మధ్య వస్తుంది. ఈనెల 7న వచ్చే పౌర్ణమి బొడ్డెమ్మల పౌర్ణమే. ముఖ్యంగా ఈ పండుగ ప్రకృతికి, మహిళల సంతాన సాఫల్యానికి, భూమికి మధ్య ఉన్న అనుబంధాన్ని తెలుపుతుందని నమ్మకం.

బొడ్డెమ్మ తయారీ విధానం..

బొడ్డెమ్మను పుట్టమట్టి లేదా చెరువు మట్టిని ఉపయోగించి నాలుగు రకాలుగా, ఐదు దొంతురులుగా చేస్తారు. ఐదో దొంతురుపై పసుపు, కుంకుమ, బియ్యం పిండితో అలకరించి పసుపుతో చేసిన గౌరమ్మను ఉంచి పూజలు చేస్తారు. ఓ చెక్కపీటపై చేసే బొడ్డెమ్మను చెక్క బొడ్డెమ్మగా దాని చుట్టూ మట్టి ముద్దలు పెట్టి పూజిస్తారు. తొమ్మిదో రోజు సాయంత్రం బొడ్డెమ్మను తీసుకెళ్లి చెరువులో నిమజ్జనం చేస్తారు.



మట్టితో చేసిన బొడ్డెమ్మ (ఫైల్)

పోటీ పడి ఆడేవాళ్లం..



గ్రామీణ ప్రాంతాలలో మా చిన్నప్పుడు ప్రతి వీధిలోను పోటీ పడి బొడ్డెమ్మలు ఆడుకునే వాళ్లం. కానీ కాలక్రమేణ బొడ్డెమ్మ పండుగా కనుమరుగవుతున్నది. సంస్కృతి సంప్రదాయాలు కాపాడాలి. సంప్రదాయాలపై ప్రాచుర్యం నిర్వహించి తెలంగాణ పండుగలకి పూర్వ వైభవం తీసుకురావాలి.

- జెల్ల నర్మద, దంతాలపల్లి

తగ్గుతున్న ఆదరణ

బతకమ్మ పండుగకు ఇచ్చిన ప్రాధాన్యత బొడ్డెమ్మకు ప్రభుత్వం ఇవ్వడం లేదు. ఆధునిక యుగంలో సెల్ ఫోన్లు అభివృద్ధి చెందాక యువత ఫోన్లకు ఇచ్చిన ప్రాధాన్యత సంప్రదాయాలకు ఇవ్వడం లేదు. దీంతో అనేక పండుగలపై సెల్‌ఫోన్ల ప్రభావం తప్పడం లేదని వాదనలు వినిపిస్తున్నాయి.

మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

- ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్: తెలంగాణలో మహిళలను కోటీశ్వరులను చేయడమే సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ సంకల్పమని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మండలంలోని సికింద్రాబాద్ తండా గ్రామానికి చెందిన గుగులోత్ మాలికి మంజూరైన సంచార చేపల విక్రయ వాహనాన్ని ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళల కోసం వడ్డీలేని రుణాలు, ఉచిత రవాణా, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్న బియ్యం పంపిణీ వంటి అనేక సౌకర్యాలను కల్పిస్తున్నారని పేర్కొన్నారు.



సంచార చేపల విక్రయ వాహనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

మహిళా సంఘ సభ్యుల కోసం త్వరలో యూనిఫాం చీరలు కూడా పంపిణీ చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో ఏపీఎంలు శంకర్, బాబు, కాంగ్రెస్ నాయకులు ఖలీల్, ఎడ్ల రమేష్, పద్మం ప్రవీణ్, శంతన్ రామరాజు పాల్గొన్నారు.

కూపన్లు ఇవ్వాలని రైతుల రాస్తారోకో



రోడ్డుపై పడుకొని ఆందోళన చేస్తున్న రైతులు

బయ్యారం: బయ్యారం సొసైటీలో బుధవారం రాత్రి కొందరికి మాత్రమే యూరియా కూపన్లు పంపిణీ చేయటం వివాదాస్పదమైంది. చీకటి పడే వరకు తాము సొసైటీ వద్ద ఉన్నప్పటికీ యూరియా రావడం లేదని ఇంటికి పంపి, ఆ తర్వాత యూరియా కూపన్లు ఎలా ఇస్తారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు యూరియా కూపన్లు ఇవ్వాలని కోరుతూ ఇల్లెందు–మహబూబాబాద్ రహదారిపై గురువారం మూడు గంటలపాటు రాస్తారోకో నిర్వహించారు. రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులకు కూపన్లు ఇవ్వకపోతే పురుగులమందు తాగుతామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న ఎస్సై తిరుపతి సంఘటన స్థలానికి చేరుకున్నారు. రైతులతో మాట్లాడి పలుమార్లు చర్చలు జరిపారు. ఎస్సై వారికి నచ్చజెప్పి రైతుల ఆందోళన విరమింపజేశారు.

లంబాడీలు ఉద్యమాలకు సిద్ధంకావాలి

తొర్రూరు: లంబాడీలు ఉద్యమాలకు సిద్ధంకావాలని లంబాడ జాయింట్ యాక్షన్ కమిటీ (ఎల్‌జేఏసీ) రాష్ట్ర కన్వీనర్ భూక్య జైసింగ్‌నాయక్ కోరారు. డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో గురువారం లంబాడ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్టీ జాబితా నుంచి లంబాడీ, బంజార, సుగాలి కులాలను తొలగించాలని కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీ సోయం బాబురావు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావులు కుట్రలు చేస్తున్నారని అన్నారు. ఈనెల 9న హన్మకొండలో ఏకశిలా పార్కు నుంచి అంబేడ్కర్ సెంటర్‌వరకు చేపట్టే శాంతి ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర నాయకులు జాటోతు కిషన్ నాయక్, వీఎస్ నాయక్, బానోతు వెంకన్న నాయక్, జైసింగ్ నాయక్, కాలు నాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జైసింగ్ నాయక్

సమస్యలు పరిష్కరించాలి

గార్ల: పొట్టకూటి కోసం సంచార జీవనం కొనసాగిస్తున్న బేడ బుడిగ జంగాల కులస్తుల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కందునూరి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం బుడిగ జంగాల కులస్తులు గార్ల పురవీధుల్లో ప్రదర్శన నిర్వహించి, తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ శారదకు అందజేశారు. ధర్నాలో సీపీఎం నాయకుడు పెద్దవెంకటేశ్వర్లు, నాగరాజు, ప్రవీణ్, సమ్మయ్య, సాయిరాం, వీరన్న, వెంకటేష్, రమేష్, లక్ష్మి, కోటమ్మ పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డును తరలించాలి



ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

నెహ్రూసెంటర్: పట్టణంలోని ఇల్లెందు రోడ్డులో గల డంపింగ్‌యార్డును అక్కడి తరలించాలని సీపీఎం జిల్లా సమితీ సభ్యులు సమ్మెట రాజమౌళి, పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాంనాయక్ డిమాండ్ చేశారు. పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో చెత్త డంపింగ్‌యార్డు వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇళ్ల సమీపంలో చెత్తా చెదారాన్ని వేయడం ద్వారా ప్రజలు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మున్సిపాలిటీ అధికారులు స్పందించి డంపింగ్‌యార్డును తరలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రావుల రాజు, పంజాల ఉపేంద్ర, జంగా కళావతి, జనగం సైదులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సేవలు మరువలేనివి



కురవి: కాంపల్లిలో రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



మహబూబాబాద్ అర్బన్: హనుమతునిగూడెం పాఠశాలలో ఉపాధ్యాయులకు సన్మానం



మహబూబాబాద్ రూరల్: కంబాలపల్లి జెడ్పీ హైస్కూల్‌లో..



డోర్నకల్: మైనారిటీ బాలికల పాఠశాలలో..



మరిపెడ రూరల్: వీరారం హైస్కూల్‌లో..



తొర్రూరు: మైనార్టీ బాలికల గురుకులంలో..

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ముందస్తు వేడుకలు ఘనంగా జరిగాయి. మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులను విద్యార్థులు పూలమాలలతో సత్కరించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సేవలు మరువలేనివన్నారు. విద్యారంగ అభివృద్ధికి సర్వేపల్లి రాధాకృష్ణ ఎంతో కృషి చేశారని, ఇలాంటి మహోన్నతమైన వ్యక్తులను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ముందుకుపోవాలన్నారు. - సాక్షి నెట్‌వర్క్

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

కేసముద్రం: విద్యార్థులను జ్ఞానవంతులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఎంఈఓ కాలేరు యాదగిరి అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని గురువారం మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 21మందిని సన్మానించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు బండారు నరేందర్, రాజు, కనకయ్య, చంద్రశేఖర్, రాజశేఖర్, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు పాల్గొన్నారు. అదే విధంగా మండలంలోని కల్వల జెడ్పీహైస్కూల్‌లో హెచ్‌ఎం బండారు నరేందర్, ఉపాధ్యాయులను కేసముద్రం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి ఘనంగా సన్మానించారు.

నెల్లికుదురు: గురుపూజోత్సవంను పురస్కరించుకుని మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించినట్లు ఎంఈఓ ఏ.రాందాస్ తెలిపారు.



కేసముద్రం: సన్మానిస్తున్న ఎంఈఓ యాదగిరి

ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక

పెద్దవంగర: పాధ్యాయ దినోత్సవం మండల స్థాయిలో 12 మంది ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనట్లు ఎంఈఓ బుదారపు శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరిని ఈ నెల 6న మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో ఘనంగా సన్మానించనున్నట్లు ఎంఈఓ వెల్లడించారు.

బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి



నూతన బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

తొర్రూరు: బ్యాంకు సేవలను స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ జీపీఎస్ చైతన్యకుమార్ తెలిపారు. డివిజన్ కేంద్రంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు బ్రాంచ్‌ను గురువారం అధికారులు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ.. దేశంలోని అతిపెద్ద గ్రామీణ బ్యాంకుల్లో టీజీబీ ఒకటని తెలిపారు. చిన్న, సన్నకారు రైతులకు పంట రుణాలు, వీధి వ్యాపారులు, చిరు వ్యాపారులకు రుణాలు అందిస్తూ ప్రోత్సహిస్తోందన్నారు. గ్రామీణ బ్యాంకు సామాన్యుల సేవే పరమావధిగా శాఖలను ఏర్పాటు చేసి అనతి కాలంలోనే ప్రజాధారణ పొందిందన్నారు. కార్యక్రమంలో ఆపరేషన్ మేనేజర్ వెంకటాచారి, బీఎం నవీన్‌కుమార్, సిబ్బంది అశోక్, రాజులు పాల్గొన్నారు.

యూరియా కోసం తప్పని పాట్లు



గూడూరు పీఏసీఎస్ వద్ద యూరియా కోసం రైతుల క్యూ..



కురవి గ్రోమోర్ షాపు వద్ద బారులుదీరిన రైతులు



డోర్నకల్: క్యూ కట్టిన రైతులు

యూరియా బస్తాల కోసం రైతులు పాడుతున్న పాట్లు కొనసాగుతునే ఉన్నాయి. గురువారం యూరియా కోసం రైతులు పీఏసీఎస్ సెంటర్ల వద్ద బారులుదీరారు. రెండు రోజుల క్రితం రైతులకు ఇచ్చిన కూపన్లు పొందిన వారందరికీ పంపిణీ చేశారు. యూరియా కోసం మహిళలు, పురుషులు భారీగా తరలిరావడంతో పోలీసులు దగ్గరుండి యూరియా అందజేశారు. - సాక్షి నెట్‌వర్క్

సంక్షిప్త సమాచారం

గుంతలను పూడ్చిన బీఆర్ఎస్ కార్యకర్తలు

కురవి: మండలంలోని నల్లెల్ల గ్రామ శివారులో ఉన్న కల్వర్టు వర్షాలకు దెబ్బతిని పెద్ద గుంతలు ఏర్పడి ప్రజలు రోడ్డుపై నడవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గురువారం గ్రామ బీఆర్ఎస్ కార్యకర్తలు నిమ్మలగంటి కృష్ణమూర్తి, మంచిప్రోలు చంద్రారెడ్డి స్పందించి సొంత ఖర్చులతో ట్రాక్టర్‌లో మట్టిని తీసుకొచ్చి గుంతలను పూడ్చించాడు.

బీజేపీలో చేరిక

మహబూబాబాద్ రూరల్: మండలంలోని సాదు తండా గ్రామపంచాయతీ పరిధిలోని వివిధ పార్టీలకు చెందిన పలువురు బీజేపీలో చేరినట్లు మండల అధ్యక్షుడు బానోత్ జహిందర్ నాయక్ గురువారం తెలిపారు. కార్యక్రమంలో హుస్సేన్ నాయక్, కిశోర్ పాల్గొన్నారు.

బైకు, లారీ ఢీ.. ఒకరికి గాయాలు

దంతాలపల్లి: బైకును లారీ ఢీకొట్టగా ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా, తుంగతుర్తి మండలం, గొట్టిపర్తి గ్రామానికి చెందిన రేబల్లి శంకర్ సొంత పనికోసం ద్విచక్రవానంపై దంతాలపల్లికి వచ్చాడు. తిరిగి వెళ్తున్న క్రమంలో పాలేరు వాగు సమీపంలో లారీ ఢీకొట్టింది. ఈఘటనలో శంకర్ కాలు విరిగి తీవ్రగాయాలయ్యాయి. శంకర్‌ను 108లో మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

యూరియా కొరత తీర్చాలని వినతి

కురవి: యూరియా కొరత తీర్చాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి గురువారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు

నెల్లికుదురు: ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి గుడుంబా తయారు చేసే సరుకులను పట్టుకున్నారు. గురువారం ఎన్‌ఫోర్స్‌మెంటు ఎస్సై రజిత తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మేచరాజుపల్లి గ్రామంలోని గోరంట్ల సతీష్ కిరాణం షాపులో దాడులు నిర్వహించి సోదాలు చేయగా గుడుంబా తయారు చేసే 8 ప్యాకెట్లఈస్ట్ (40 కిలోలు), 100 కిలోల చెక్కర, 150కిలోల బెల్లాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రైతులు ఆందోళన చెందవద్దు

డోర్నకల్: ఎరువుల అవసరం ఉన్న రైతులు ఆందోళన చెందవద్దని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కాలా సుమేర్‌చంద్‌జైన్ కోరారు. మండలంలోని గొల్లచర్ల సమీపంలోని పీఏసీఎస్ కార్యాలయంలో గురువారం జరిగిన ఎరువుల పంపిణీని ఆయన పరిశీలించారు.

లారీ ఢీకొని విరిగిన విద్యుత్ స్తంభాలు

డోర్నకల్: మండలంలోని అమ్మపాలెం గ్రామంలో గురువారం కట్టెల లోడుతో వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో రెండు విద్యుత్ స్తంభాలు విరిగి విద్యుత్ వైర్లు రోడ్డుపై పడ్డాయి. ఘటన జరిగిన సమయంలో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. విద్యుత్‌శాఖ ఏఈ కిరణ్ తమ సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకుని మరమ్మతు పనులు చేపట్టారు.

యూరియా పంపిణీకి చర్యలు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని రైతులకు గ్రామాలవారీగా రైతుభరోసా లిస్టు ఆధారంగా యూరియా పంపిణీకి చర్యలు తీసుకుంటామని ఏఓ తిరుపతిరెడ్డి గురువారం తెలిపారు. రైతులు తమ వివరాలను గ్రామ సెక్రటరీ వ్యవసాయ విస్తరణ అధికారుల ద్వారా తెలుసుకుని మాత్రమే సంబంధిత పీఏసీఎస్ వద్దకు వచ్చి యూరియా తీసుకెళ్లాలని కోరారు.

నిధులు మంజూరు చేయాలి



గార్ల: గార్ల సమీపంలోని పాకాల ఏటిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు గుండెబోయిన నాగమణి గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు.

డీఏ జూగా స్కీం పనులు ప్రారంభం

కేసముద్రం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన డీఏ జూగా (ధర్తి ఆబా జననాతి గ్రామ ఉత్కర్ష్ అభియాన్) స్కీంలో భాగంగా కేసముద్రం మండలం గాంధీపురం, ఇనుగుర్తి మండలంలోని రాముతండాలో టీజీఎన్‌పీడీసీఎల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.మోహన్‌రావు, సూపరింటెండెంట్ ఇంజనీర్ విజేందర్ రెడ్డి గురువారం ప్రాజెక్ట్ పనులను ప్రారంభించారు. మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, డీఈ విజయ్, సునీతాదేవి, మల్లిరెడ్డి, ఏడీఈ ఐలయ్య, ఏఈ రాజు పాల్గొన్నారు.

నోట్ బుక్స్ పంపిణీ

తొర్రూరు రూరల్: మండలంలోని అమర్‌సింగ్ తండాకు చెందిన ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులకు గురువారం కాంగ్రెస్ నాయకులు నోటు బుక్స్, పెన్నులు, పలకలు, పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ పానుగోటి సోమేశ్వర్‌రావు, నాన్న ఫౌండేషన్ చైర్మన్ ధారావత్ రాజేష్‌నాయక్, కందాడి అచ్చిరెడ్డి, కుశాల్, అనిల్, మనోహర్, నరేష్‌నాయక్ పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

డోర్నకల్: స్థానిక పంపుబావితండాలోని ఓ ఇంట్లో గురువారం అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి చెందాడు. డోర్నకల్ సీఐ చంద్రమౌళి తెలిపిన వివరాల ప్రకారం చాప్లాతండాకు చెందిన లకావత్ జామ్లా (55) పంపుబావితండాలోని రత్నం అనే వ్యక్తి ఇంట్లో పనులు చేస్తున్నాడు. గురువారం ఉదయం జామ్లా పనికి వచ్చిన రెండు గంటల తర్వాత ఇంటి యజమాని జామ్లా కుమారుడు నరేష్‌కు ఫోన్ చేసి మీ నాన్న కింద పడ్డాడని సమాచారం ఇచ్చాడు. నరేష్ వెంటనే డోర్నకల్ చేరుకుని జామ్లాను పీహెచ్‌సీకి తీసుకెళ్లి అక్కడి నుంచి 108 వాహనంలో మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించగా జామ్లా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తన తండ్రి మృతిపై అనుమానాలు ఉన్నాయంటూ కుమారుడు నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతున్న మహిళ..

మరిపెడ రూరల్: మరిపెడ మండలం అబ్బాయిపాలెం గ్రామానికి చెందిన జినక ఎల్లమ్మ (46) ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎల్లమ్మ కొద్ది రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది.

పురుగుల మందు తాగి ఒకరు

నర్సింహులపేట: నర్సింహులపేట గ్రామానికి చెందిన ఇర్రి భిక్షం(62)కడుపు నొప్పి భరించలేక పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మాలోతు సురేష్ తెలిపారు. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం 108లో మహబూబాబాద్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ భిక్షం మృతి చెందాడు. మృతుడి కుమారుడు ఇర్రి యాకూబ్ ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్సై తెలిపారు.